# 2014 తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పరిణామాలు అర్థం చేసుకోవడానికి ఏర్పాటు చేస్తున్న సదస్సు

**(విజయవాడ, ఆగస్టు 11,12, మాకినేని బసవపున్నయ్య హాల్)**

నిర్వాహకులు: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిసెర్చ్ ఆన్ ఆంధ్రప్రదేశ్ (ఐరాప్)

సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలుగా విభజించబడి ఇప్పటికి ఐదు సంవత్సరాలు దాటింది. విభజన వలన జరిగిన పరిణామాలు, మిగులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పర్యవసానాలు, ఆ రాష్ట్రంలో జరుగుతున్న మార్పులు, అభివృద్ధి తీరుతెన్నుల గురించి సమీక్ష చెయ్యవలసిన సమయం ఆసన్నమైంది. ఆ ప్రయత్నంలో భాగమే ఈ సదస్సు.

కొత్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎదుర్కొన్న ప్రధాన సమస్య కొత్త రాజధాని నిర్మించడం(అమరావతి). కొత్త రాష్ట్రంలో మల్లగుల్లాలు పడుతున్న మరో రెండు ప్రధాన సమస్యలు వున్నాయి. మొదటిది కొత్త సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడం లేదా పాత ప్రాజెక్టులలో లోపాలు సవరించి మెరుగుచెయ్యడం. దీనికి ఉదాహరణలు పోలవరం, పట్టిసీమ, హంద్రీనీవా. రెండవ అంశం ప్రత్యేక ఆర్థిక జోన్‌లు అమల్లోకి తీసుకురావడం. దీనికి ఉదాహరణలు చిత్తూరు జిల్లాలో శ్రీసిటీ నిర్మాణం, అనంతపురం జిల్లాలో కియా కారు కర్మాగారం ఏర్పాటు, దక్షిణకోస్తా జిల్లాలో ఆక్వా ప్రాజెక్టుల విస్తరణ, విశాఖపట్టణం జిల్లాలో ఫిన్‌టెక్ సిటీ నిర్మించడం.

కొత్త రాష్ట్రం రూపుదిద్దుకున్న తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా లభిస్తుందని సర్వత్రా ఆశ, కోరిక పెల్లుబికింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఆ డిమాండ్‌ను తిరస్కరించింది. ప్రధాన రాజకీయ సమూహాలైన వైఎస్ఆర్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ, వామపక్షాలు, జనసేన వంటి పార్టీలు ఈ డిమాండ్స్‌ను ప్రాముఖ్యపర్చాయి. నిధులు/ వనరులు కూడగట్టడం కోసం ఇతర మార్గాలు కూడా వెదుక్కోవడం జరిగింది. ఈ ప్రయత్నానికి ఉదాహరణలు స్వచ్ఛంద భూవిరాళం/ సేకరణ, అమలులో వున్న భూసేకరణ చట్టాలకు చేసిన సవరణలు, అమరావతి బాండ్ల వంటి పబ్లిక్–ప్రైవేటు జోడీ ప్రయత్నాలు, రిజర్వు బ్యాంకు సెక్యూరిటీల వేలం, దేశాంతర తెలుగువారికి ప్రత్యేక బాండ్ల అమ్మకం, సింగపూర్, మలేషియా, జపాన్ లాంటి ఆసియా దేశాల వద్ద నుండి పెట్టుబడి ఆకర్షించే స్కీములు, పర్యాటక రంగాన్ని విస్తరించి అభివృద్ధి చేయ్యడం ద్వారా వనరులు కూడగట్టే ప్రయత్నాలు.

పైన ఉదహరించిన ప్రయత్నాలు కొంత జరిగినా రాష్ట్రంలోని వాస్తవ పరిస్తితులు ఆందోళనకరంగా వున్నాయి. నూతన ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్యమైన మూడు ఉప ప్రాంతాలైన ఉత్తరకోస్తా, దక్షిణకోస్తా, రాయలసీమ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజాశ్రేణులు– రైతులు, కౌలుదారులు, వ్యవసాయ కార్మికులు,

చేనేత కారులు, చేతివృత్తిదారులు, చిన్న వ్యాపారస్తులు. వీరి ఆర్థిక పరిస్థితి క్షీణదశ పట్టింది. వివిధ వర్గాల మధ్య వున్న ఆర్థిక అసమానతలు పెరిగి మిన్నంటుతున్నాయి. గ్రామ ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో ఇతర ప్రదేశాలకు వలస పోతున్నారు. అదే సమయంలో జార్ఖండ్, బీహార్, పశ్చిమబంగా, ఒడిశా వంటి రాష్ట్రాల నుండి ప్రజలు, కార్మికులు ఆంధ్రప్రదేశ్‌లోని వ్యవసాయం, భవననిర్మాణం, చేపలు, రొయ్యల ఉత్పత్తి వంటి రంగాలలో పనిచెయ్యడానికి అనేకులు వలస వస్తున్నారు. భూసేకరణ కార్యక్రమం వల్ల చాలా మంది రైతులు చితికిపోయారు. వీటికి తోడుగా ప్రకృతి వైపరీత్యాలు జనజీవన స్థితిమీద ప్రబలమైన ప్రభావం చూపించాయి. 2014, 2018 లలో వచ్చిన తుపానులు ఉత్తరకోస్తా ప్రాంతాన్ని దెబ్బతీశాయి. గడచిన మూడు సంవత్సరాలలో వర్షాభావం వలన ఏర్పడిన కరువు కాటక పరిస్థితి రాష్ట్రంలో వున్న 670 మండలాల్లో సగానికి సగం మండలాల మీద ప్రభావం చూపింది. ఈ గడ్డు పరిస్థితులు అనుభవించిన ప్రజలలో చైతన్యం పెరిగి వారు పోరాట మార్గం పడుతున్నారు.

భూసేకరణ, భవానిపాడు ఓడరేవు విషయంలో పశ్చిమగోదావరి జిల్లాలో చేపల ఉత్పత్తి కేంద్రాల విషయంలో, ప్రభుత్వ పాఠశాలల మూసివేత విషయంలో, విద్యా వ్యాపారీకరణ విషయంలో, వ్యవసాయక దుస్తితి విషయంలో జరుగుతున్న పోరాటాలు, ప్రతిఘటన ఈ వ్యతిరేకతకు ఉదాహరణలు. ప్రజలలో వున్న ఈ అసంతృప్తిని చల్లబరచడానికి ప్రభుత్వం పేదలకు ఇళ్లు, పసుపు కుంకుమ, అన్నదాతా సుఖీభవ, ఉపాధి లేని వారికి భత్యాలు వంటి అనేక జనాకర్షక స్కీములు ప్రవేశపెట్టింది. వాటితో సంతృప్తి చెందని ప్రజలు అధికారంలో వున్న పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి కొత్తపార్టీని అధికారంలోకి తెచ్చారు. అయితే కొత్త ప్రభుత్వం కూడా తనదైన అనేక కొత్త జనాకర్షక పథకాలతో ప్రజల మెప్పు పొందాలనే ప్రయత్నంలో వున్నది. ఈ సమస్యల వెనుక వున్న మౌలిక కారణాల మీద రాజకీయ పార్టీల దృష్టి లేదు. ఈ సమస్యలన్నింటి మీద కూలంకష చర్చ చేయడానికి మేము ఈ సదస్సును నిర్వహిస్తున్నాం.

**ఐఆర్ఏపి ( I R A P ) గురించి:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, వర్గ సంబంధమైన, ప్రాంతీయ, లైంగిక(జెండర్) అంశాలు, విషయాలు.. ముఖ్యంగా జరుగుతున్న సమాజానికి సంబంధించిన విషయాల గురించి విమర్శనాత్మక అధ్యయనం చెయ్యాలన్న ఆలోచనతో మేము కొంతమందిమి ఏర్పాటు చేసిన సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఆంధ్రప్రదేశ్ (ఐఆర్ఏపి) Institute for Research on Andhra Pradesh(IRAP).

మా వెబ్‌సైట్: www.irap.org.in